

తె ల్లవారుతోంది....

మాధవన్ ట్రయిన్ దిగాడు.

స్టేషన్ దాటి రోడ్డుమీదికొచ్చాడు.

రెండే రెండు రిక్షాలు—నాలుగు గుర్రపుబళ్ళు కనిపించాయి

'పాలెం వస్తారా బాబూ....'

వద్దని తలూపుతూ మాధవన్ ముందుకు సాగి పోయాడు.

పాలెం అక్కడికి నాలుగు కిలోమీటర్ల దూరం.

వేస్తున్న ప్రతి అడుగులోను అతనికో కొత్త అనుభవం ఎదురవుతోంది.

పరిసరాల్ని పరిశీలిస్తూ—కూని రాగం తీసు కొంటూ—అలా చాలా దూరం వెళ్ళిపోయాడు.

పాలెం దగ్గరపడింది.

'జానకమ్మగారిల్లెక్కడండీ...' మాధవన్ అడిగాడు ఎవర్నో.

'అదిగో'...ఆ కొండపక్కనే....'

మాధవన్‌కు కొండ కనిపించింది.

కొండపక్క ఇల్లనగానే కొండంత ఉత్సాహం ఉరకలేసింది.

పాలెం తనకు కొత్త. పిన్ని అనేక సార్లు బతిమాలింది రమ్మని కబుర్లు పెట్టింది. ఉత్తరాలు రాసింది..... ఇప్ప టికి కుదిరింది ప్రయాణం.

మాధవన్‌కు అల్లంతదూరంలోనే పిన్ని కనిపించింది—బావిదగ్గర నీళ్ళు తోడుతూ.

'పిన్నీ......'

జానకమ్మ కళ్ళు దీపాల్లా వెలిగాయి.

నమ్మలేకపోయింది.

'నాబాబే....' మాధవన్‌ని తనివితీరా ఒక్కసారిగా గుండెలకు హత్తుకొంది జానకమ్మ'

ఆ స్పర్శతో అక్షరాలకందని ఏదో ఆత్మీయత....'

అనిర్వచనీయమైన ఆనందం....

మాధవన్‌కు తల్లి అనురాగం తెలీదు.

'ఏదీ మీ ఆవిడ.....'

'తనూ పుట్టింటికెళ్ళింది.....'

'తీసుకురాలేకపోయావా....' మాధవన్ ముఖంలోకి వాత్సల్యంగా చూస్తూ అంది జానకమ్మ.

'ఈసారి తీసుకొనస్తాన్లే పిన్నీ.....' అన్నాడు మాధవన్.

జానకమ్మ పొయ్యి వెలిగించింది— నీళ్ళు కాయటానికి.

మాధవన్ వద్దన్నాడు. చన్నీళ్ళే చేస్తా నన్నాడు.

ఆ బావిదగ్గర—తనే నీళ్ళుతోడుకొని ఆనందంగా స్నానం చేశాడు.

అదో థ్రిల్ అనిపించింది అతనికి.

అప్పుడే రుబ్బిన మినప పిండితో వేడి వేడిగా అట్లువేసి పెట్టింది జానకమ్మ.

'బలే బాగున్నాయి పిన్నీ...' అన్నాడు మాధవన్.

మరో రెండు వడ్డించింది జానకమ్మ'

అమ్మ తరువాత అమ్మ...' పిన్నికి దగ్గరగా కూర్చొని ఎన్నో కబుర్లు చెప్పాడు మాధవన్.

జానకమ్మకూడ పాతసంగతులు గుర్తు చేసింది.

'ఏంకూర చేయమంటావో చెప్ప.. దొడ్లో అన్నీ వున్నాయి. చూసుకో...నీ ఇష్టం....'

'ఒక కూరచాల్లే పిన్నీ...' అన్నాడు మాధవన్—పిన్నికి కష్టం కలిగించటం ఇష్టంలేక.

మధ్యాహ్నం ఒంటిగంటయింది—

మాధవన్ వేడివేడి భోజనంముందు కూర్చున్నాడు.

ఘుమఘుమలాడిపోతోంది గుత్తొం కాయ...

పక్కనే పప్పు-తోటకూర....

కొత్తిమిరి రసం...

గడ్డపెరుగు...

మాధవన్‌కు దగ్గరగా కూర్చొని జానకమ్మ ఒక్కటే వడ్డించింది—అమ్మకు ప్రతిరూపమై.

మాధవన్ చాల్లే అంటున్నా—బతిమాలి మరీ తినిపించింది జానకమ్మ. రాత్రంతా ప్రయాణంతో సరిగా నిద్రపట్టలేదు. పైగా ఇప్పుడు భుక్తాయాసం...వీటితో మాధవన్‌ను పిలవకుండానే నిద్ర ముంచుకొచ్చింది.

నిద్రగన్నేరు చెట్టుక్రింద మంచం వాల్చుకొని ప్రశాంతంగా నిద్రపోయాడు.

లేచేసరికి నాలుగు—

'అలా వెళ్ళొస్తాను పిన్నీ...అన్నాడు మాధవన్'

'నీకేం తెలుసిక్కడ...నేనూ వస్తా....' అంది జానకమ్మ.

'ఆకొండ పక్కకి వెళ్ళొస్తా సరదాగా....నువ్వొద్దులే....'

'ఎక్కువసేవుండకు...వచ్చేయ్...'

మాధవన్ లుంగీ చుట్టుకొని కెమెరాతో బయల్దేరాడు.

కొండకి అటువైపుగా వెళ్ళటానికి చిన్నకాలిబాట కనిపించింది.

ఆదారిలో నడిచి ఓచోట ఆగాడు.

అక్కడో సెలయేరు కనిపించింది.

కల్లాకపటం తెలీని పల్లెటూరి కన్నె పిల్లలా అగుపించింది సెలయేరు. ఆ గలగలల్ని ఆస్వాదిస్తూ అక్కడే కాసేపు కూర్చుండి పోయాడు.

దోసిలినిండా నీళ్ళు తీసుకొన్నాడు.

నిర్మలంగా వున్నాయి ఆ నీళ్ళు—పల్లె మనసులా.

ఆ కొండనీ, ఆ సెలయేరునీ కలుపుతూ ఫోటో తీశాడు.

అక్కణ్ణించి మరికొంత దూరం నడిచాడు.

పంటపొలాలు పచ్చగా నవ్వుతూ రారమ్మని పిలిచాయి.

ఆ పరిసరాల్లో—ఒంటినిండా గుడ్డకప్పకొని సంచరించే స్త్రీలు కనిపించారు.

ఒక్కసారిగా ఏదో కొత్తలోకంలోకి వచ్చినట్లనిపిచింది మాధవన్‌కి.

అప్పటికే సాయంత్రం ఆరున్నరయింది. పిన్ని ఎదురుచూస్తుంటుందేమోనని ఇంటిముఖం పట్టాడు మాధవన్.

రెండ్రోజులు గడచిపోయాయి.

పాలెం వీడ్కోలు చెప్పింది మాధవన్‌కు.

ట్రయిన్ ఎక్కాడు.

రాత్రి పదకొండు కావస్తున్నా నిద్ర రావటం లేదు.

లేచి కూర్చున్నాడు.....



# వసంతం వాడిపోతున్న వేళలు...

- రసరాజు -

మళ్ళీ పడుకొన్నాడు....

పాతెంలో అనుభూతులు మాధవన్ చుట్టూ పరిభ్రమిస్తున్నాయి.

ఎంత ఆత్మీయత...

ఆ ప్రకృతీ...ఆ ఆనందం....మూల్యానికి అందుతాయా!

నిజానికి తను ఉంటున్నది ఒక మహానగరంలోనే....


హోదా వెలగబెట్టే ఉద్యోగం....

మంచిఇల్లు—అందులో ఏ.సి పడక గది.

అందమైన పెళ్ళాం—ఆమెకూడ ఉద్యోగం చేస్తోంది.

# ఎప్పుడూ శత్రువే గెలుస్తున్నాడు

చరిత్ర తిరగేస్తే ఎవరు పరాజితులో తెలీకపోదు
మనల్ని విజయలక్ష్మి వరించడం
తాత్కాలికమేనని తెలుసుకోలేకపోతున్నాం
ఎప్పుడూ శత్రువే మన మీద సవారీ చేస్తున్నాడు
మన చదువుల మీదా
మన ఆలోచనల మీదా, అవగాహనల మీదా
శత్రువు ఎగరవేసే విజయపతాకం చూడలేకపోతున్నాం
మనల్ని మనకు కాకుండా చేసే
తీవ్రవాదం ముందు సాగిలపడ్డాంగదా!
సరే, ఇప్పుడు మరో బలమైన శత్రువు
బుల్లితెర ఆయుధంగా దాడి చేస్తోంది
ప్రేమ పలకరింపులూ ... కుశలప్రశ్నలూ లేవు
పుస్తకపఠనాలూ... సాయం సమావేశాలు లేవు
మనసు విప్పుకోడాలు లేనే లేవు
అన్నీ చిరాకులే! అన్నీ అసహనాలే!
శరీరాలు దగ్గరే – మనసులు దూరం దూరం!
కళ్ళనీ మెదడునీ తాకట్టు పెట్టి
అన్నదమ్ముల మధ్య – భార్యాభర్తల మధ్య
తండ్రీకొడుకుల మధ్య
ఛానల్ మార్చటం కోసం
అనురాగం పణంగా పెడతాం




దేవతా వస్త్రాలు కూడా లేని అంగాంగాల్ని
నట్టింట్లో ప్రదర్శిస్తూ విస్సిగ్గులమవుతాం
సోమరితనానికి పట్టాభిషేకం చేస్తాం
పిల్లలంతా ప్రభుదేవాలకీ, జాక్సన్‌లకీ, అపాచీలకీ
అంత్యాక్షరీలకీ
"ఏక్ సెబడ్ కర్ ఏక్"గా మురిసిపోతుంటే
మనం ఇరవై ఒకటో శతాబ్దంలో ఉన్నామని
అజ్ఞాన తన్మయత్వం చెందుతాం
నిజానికి ప్రజలకి దూరమైంది దూరదర్శన్ కానేకాదు–
మన సంస్కృతి ... మనం మాత్రమే!!

– డాక్టర్ ద్వా.నా. శాస్త్రి

అన్నీ ఉన్నాయి....

అయినా ఏదో అసంతృప్తి...

జీవితంలోకి కొని తెచ్చుకొన్న ఏదో నకిలీ ఆనందం....

మాధవన్ ఉదయం ఏడుదాటితే ఇంట్లో ఉండడు. రాత్రి వచ్చే సరికి పది–తప్పితే పదకొండు... ఇంట్లో కుక్క కాపలా.

మాధవన్ భార్యకుకూడా ఆసిటీలోనే ఉద్యోగం. ఏడు గంటలకు ముందే ఆమె లోకల్‌ట్రయిన్ కేచ్ చేయాలి. రాత్రి ఇల్లు చేరేసరికి తొమ్మిది. వండు కొనేదెవ్వడు... తినేదెవ్వడు...ఎటొచ్చీ ఆదివారం ఒక్కరోజే సెలవు. ఆరోజు అన్ని పనులూ చక్కబెట్టుకోవాలి.

నాలుగైదు రకాల ఇన్‌స్టెంట్ కూరలు ఎప్పుడూ సిద్ధంగా వుంటాయి.

ఫ్రెజ్‌లో వారానికి సరిపడేలా ఒకే సారి తోడుపెట్టిన పెరుగు...

మాధవన్ రాత్రి వచ్చేసరికి అతని భార్య బడలికతో రోజుతూ రొప్పుతూ బెడ్‌మీద వుంటుంది.

కావలసినవి తనే వడ్డించుకొంటాడు–డైనింగ్ టేబుల్ ముందు కూర్చొని ఆ తరువాత అతనూ బెడ్‌పై వాలిపోతాడు.

ఈ యాంత్రిక జీవితంలో మాధవన్ విసుగెత్తిపోయాడు.

తాజా భోజనానికి నోరు నోచుకోదు. ఫ్రిజ్‌లో దాచుకొనేవి కొన్ని...ఇన్‌స్టెంట్ ఫుడ్స్‌కొన్ని...

ఆత్మీయంగా వడ్డించేవాళ్ళుండరు...

కమ్మటి గడ్డపెరుగు కనిపించదు. అంతా వెన్నతీసిన పాలే...శుభ్రమైన గాలి కూడా కొరతే...

ఎక్కడచూసినా కాలుష్యం...మురుగుకాల్వలు...

ఒళ్ళు కనిపించేలా ఫ్యాషన్లు...

అంతా 'హలోహలో'లే తప్ప ఆప్యాయత ఆవగింజంతయినా అగుపించదు...

సహజత్వం కాగడాపెట్టి గాలించినా కనిపించదు.

మాధవన్ మనస్సు వేడెక్కిపోయింది.

ట్రయిన్–చీకటిని చీల్చుకొంటూ ముందుకు దూసుకుపోతోంది.

వాచీకేసి చూశాడు–రెండు...

రేపు ఉదయం ట్రయిన్ దిగగానే మళ్ళీ నగరజీవితానికి అంకితమై పోవాలన్న భావనరాగానే–మాధవన్ మనస్సు–మూగగా మూలిగిందొక్కసారి.

వసంతం వాడిపోతున్నచోట–తిరిగి కాలుపెట్టాలనగానే–ఏదో తెలీని విస్సత్తువ తనలో చోటు చేసికొంది. ◆